అత్తా-కోడలు

పి. అరుణ

నాకిలాంటి మొగుడు కావాలి—అని గిరిజ ఎప్పుడూ తండ్రితో చెప్పలేదు. అలాగని తల్లితో కూడా చెప్పలేదు. ఆ ఇద్దరికీ చెప్పకపోయినా తమ కూతురుకు యెలాంటి మొగుడు అవసరమో వాళ్ళకు బాగా తెలుసు.

అందుకే గిరిజ తండ్రి జనార్దనం తన కూతురు కోరు కొనే 'క్వాలటీస్' వున్న మొగుడికోసమే వేట మొదలు పెట్టాడు.

గిరిజ పూర్తిగా తండ్రి పోలిక. ఆమె పుట్టగానే చూసి తన పోలికలు రానందుకు బాధపడింది గిరిజ తల్లి జానకమ్మ. కాని వయసు పెరిగేకొద్దీ తన బుద్ధులు రావటం చూసి ఆమె ఆ బాధను పోగొట్టుకుంది. గిరిజ పూర్తిగా తననే అనుసరించటం చూసి సంతోషపడింది.

జనార్దనం కూతురుకు తన పోలికలు వచ్చినందుకు ఆనందపడ్డాడుకాని తన గుణాలు రాకుండా భార్య బుద్ధులు వచ్చినందుకు మనసులోనే విచారపడ్డాడు. తన

లాగే మరో మగాడు కూడా కొన్నాళ్ళు కష్టాలు అనుభవించక తప్పదనుకున్నాడు.

జానకమ్మను చేసుకున్న తర్వాత జనార్దనానికి కొన్నాళ్ళు జీవితం చీకటిగానే అనిపించింది. ఆమె జనార్దనం మాటను లెక్క చెయ్యలేదు. తను చెప్పినట్లే వినాలనేది. వినకపోతే యేనుయ్యో గొయ్యో చూసుకుంటానని బెదిరించేది. పూర్తిగా ఇంట్లో అన్ని విషయాల్లో ఆమెదే పై చెయ్యి. ఇందుకు జనార్దనం ఒప్పుకోలేదు. ఆయన అమ్మా నాన్నా కూడా ఒప్పుకోలేదు. అందుకే మొగుడ్ని తన చావుతో భయపెట్టి వేరు కాపురం పెట్టించింది. చివరకు జనార్దనం మారిపోక తప్పలేదు. పేరుకే మగాడుగా మిగిలిపోయాడు.

ఆయన ఇంట్లో పిల్లి. బయట కూడా పిల్లే. భార్య చేతిలో బొమ్మ అనే పేరు ఆయిన బంధువుల్లో, స్నేహితుల్లో పూర్తిగా స్థిరపడిపోయింది.

ఇప్పుడు ఆ ఇంటికి రాబోయే అల్లుడు కూడా అలాంటి పేరునే తెచ్చుకుంటాడని జనార్దనానికి తెలుసు. మగవాడికి మరో మగవాడు అలాంటి పేరు తెచ్చుకోటాన్ని సహించలేకపోయినా తన కూతురు మనస్తత్వాన్ని దృష్టిలో వుంచుకుని ఆమె సుఖపడటానికి అలాంటి మనిషినే తన కూతురుకు మొగుడిగా తీసుకురావాలని అనుకున్నాడు.

గిరిజ బియ్యేవరకు చదువుకుంది. చదువులో ఆమెకు ఎప్పుడూ ఇంట్రస్టులేదు. చాలా యాంత్రికంగా చదువుతూ వుండేది. చదువుకునే రోజుల్లో కూడా గిరిజ మనస్తత్వం చాలా క్లియర్‌గా అందరికీ అంతుబట్టేది. చాలామంది అమ్మాయిలకు గిరిజే నాయకత్వం వహించేది.

తను చెప్పినట్టుగానే మిగిలిన వాళ్ళంతా వినాలని పట్టు బడుతూ వుండేది.

ఇది పూర్తిగా ఆమె తల్లి జానకమ్మకు వున్న లక్షణమే. మొదట్లో కూతురిలో పెరిగిపోతున్న ఈ డామినేషన్ అనే లక్షణాన్ని పోగొట్టటానికి జనార్దనం తీవ్రంగా ప్రయత్నాలు చేశాడు. కాని జానకమ్మ ఆ ప్రయత్నాలను ఫలించనివ్వలేదు. నా కూతురిలో ప్రబలంగా వున్న నా లక్షణాన్ని పోగొట్టడానికి వీల్లేదని పట్టు బట్టింది. తండ్రి మాటను వినొద్దని కూతురుతో గట్టిగా చెప్పింది.

అందుకే గిరిజ తండ్రి మాటను వినలేదు. ఇక ఆ ప్రయత్నాలను విరమించుకున్నాడు ఆయన.

గిరిజకు రెండు మూడు సంబంధాలు చూశాడు. కాని ఆ సంబంధాల్లో అబ్బాయిలంతా చురుకయిన వాళ్ళు. స్వతంత్రమైన ఆలోచనలు వున్నవాళ్ళుగా కనిపించారు. అందుకే సంబంధాలు మంచివయినా వాళ్ళవల్ల తన కూతురు తప్పకుండా కష్టాలనే అనుభవిస్తుందని వాటిని వదిలేశాడు జనార్దనం.

ఆ తర్వాత ఆయనకు యెవరో ఓ సంబంధాన్ని చెప్పారు. అబ్బాయి పేరు ఈశ్వర్. ఓ ప్రయివేటు కంపెనీలో ఐదేళ్ళనించీ ఉద్యోగం చేస్తున్నాడు. జీతం బాగానే వస్తుంది. సొంత ఇల్లు, కొంత పొలం కూడా వున్నాయి. తండ్రిలేడు. తల్లి వుంది.

జనార్దనం ఆ సంబంధం గురించి తెలియగానే ఆ వూళ్ళో ఈశ్వర్ పనిచేసే కంపెనీకి వెళ్ళి అతన్ని కలుసుకున్నాడు. అతనితో రెండు నిముషాలు మాట్లాడిన తర్వాత తప్పకుండా ఇతనే నా కూతురుకు తగిన మొగుడు

అని అనుకున్నాడు. అలా ఎందుకు అనుకున్నాడంటే తొలిచూపులోనే ఈశ్వర్ బాగా మెలుగా బిడియ పడుతూ కూర్చోవటం కూర్చొనే రకంగా అగుపించాడు. మాట్లాడిన తర్వాత ఆ అభిప్రాయం పూర్తిగా సిరపడిపోయింది.

ఈశ్వర్‌ని పెళ్ళిచూపులకు ఆహ్వానించి సంతోషంగా తిరిగివచ్చాడు.

2

పెళ్ళిచూపులకు రాబోతున్న ఈశ్వర్ గురించి చెప్పగానే జానకమ్మకు ఆనందం కలిగింది. గిరిజకు కూడా ఆనందమే కలిగింది. తండ్రి తన మనసు తెలుసుకొని అలాంటి మనిషిని పట్టుకున్నందుకు ఆయన్ని తల్లి సమక్షంలో పొగిడింది.

"ఇదంతా నీ అదృష్టం....నువ్వు బాగా సుఖపడే యోగం వుంది" అన్నది తల్లి.

ఆ రాత్రి గిరిజకు నిద్ర పట్టలేదు. ఆమె కళ్ళముందు యిద్దరు అందమైన అబ్బాయిలు గిర గిరా తిరిగారు. అందులో ఒకబ్బాయి పేరు శరత్ బాబు. రెండో అబ్బాయి పేరు సుందర్రావు.

ఆ ఇద్దరబ్బాయిలు గిరిజను ప్రేమించామంటూ ఉత్తరాలు రాశారు. తర్వాత ఆమెతో బహిరంగంగానే ఆ విషయాన్ని చెప్పారు. ఆమె అంగీకరిస్తే పెళ్ళి చేసుకుంటామని అన్నారు. ఆ ఇద్దరిలో యెవరో ఒకర్ని యే అమ్మాయైనా చేసుకోటానికి ఇష్టపడేది. కాని గిరిజ ఒప్పుకోలేదు. అందుక్కారణం ఆ ఇద్దరు అబ్బాయిలూ బాగా తెలివైనవారుగా కనిపించారు. అందుకే ఆ ఇద్దర్నీ

తిరస్కరించింది.

ఈశ్వర్, తల్లి మరో ఇద్దరు పక్కింటివాళ్ళతో పెళ్ళి చూపులకు వచ్చాడు. అతడ్ని చూడగానే కొంచెంగా నిరుత్సాహపడింది గిరిజ. అతనంత అందగాడుగా కనపడ లేదు. కాని అతనిలో కనిపించిన మందబుద్ధిని చూసి తెగ సంతోషపడింది. ఒకందుకు అతను తనంత అందంగా లేక పోవటమే మంచిదనుకున్నది. తను అతని కంటె అందంగా వున్నందుకు బాగానే మిడిసిపడవచ్చు ననుకుంది.

కాని కొడుకు పక్కనే కూర్చున్న అతని తల్లిని చూడ గానే ఆమె కొంచెం గట్టి మనిషిగానే అనిపించింది. ఆమె చూపులు మాటలు కూడా తెలివిగానే అనిపించాయి. ఈశ్వర్ నోరు మెదపలేదు. పెట్టిన టిఫిన్ని తిని, కాఫీ తాగి వక్కపొడి నములుతూ పక్క చూపులు చూస్తూ కూర్చున్నాడు. కొడుకు బదులు కూడా తల్లే గిరిజను ఏవో కొన్ని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టు కున్నది. ఆమె అడిగిన ప్రశ్నలన్నింటికీ గిరిజ అణకువగానే బదులు ఇచ్చింది.

గిరిజ తనకు నచ్చిందని ఈశ్వర్ అక్కడే సిగ్గుపడుతూ చెప్పేశాడు. అతని తల్లి కూడా తనకాబోయే కోడలు బాగానే వుందనుకున్నది. కాని కాబోయే విధ్యపురాలిదే ఆ ఇంట్లో పై చెయ్యిగా వున్నట్టు కనిపెట్టింది. ఐనా గిరిజ విధేయత చూసి సరిపెట్టుకున్నది.

తర్వాత కట్నకానుకల గురించి మాట్లాడుకుందామని వెళ్ళిపోయారు.

వాళ్ళు అటు వెళ్ళగానే "అబ్బాయి మనకి తగిన వాడు" అన్నది తల్లి భర్తతో.

"అవును. అందుకే మనం ఈ సంబంధాన్ని వదులుకో కూడదు. కట్నం ఎక్కువ ఇచ్చయినా సరే ఈ సంబంధాన్ని ఖాయపరుస్తాను" అన్నాడాయన.

"ఆయన తల్లి అసాధ్యురాలిగా కనబడుతోంది" అన్నది గిరిజ తల్లి.

"నిజమే. నాకూ అలాగే అనిపించింది. వినా పర్వా లేదు. ఆమెను నువ్వు వంచుతావనే నమ్మకం నాకు వుంది. కొడుకుతో పెళ్ళిచూపులకు వచ్చిన ప్రతి తల్లీ అట్లాగే కనబడుతుంది. కొడుక్కంటే తల్లికి కోడలు పెళ్ళిచూపుల విషయంలో ఆసక్తి ఎక్కువగా వుంటుంది. ఈ విషయంలో నువ్వు ఆలోచించకు. నీకు మొగుడు ముఖ్యం. మొగుడు చెప్పినట్టు వినే మనిషయితే అత్తగారు మనకో లెక్క కాదు" అన్నది తల్లి.

"అవును.... మీ అమ్మ చెప్పిన మాటలు నిజం. ఎంతో అనుభవం మీద చెబుతున్న మాటలు. యిందుకు నీకు వేరే ఉదాహరణ అవసరం లేదు...." అన్నాడు జనార్దనం.

"సర్లెండి. నా మాటలు విని మీరేం చెడిపోయారు. అంతో యింతో బాగుపడ్డారు" అన్నది జానకమ్మ.

'బాగుపడ్డం యేమోగానీ 'భార్య చేతిలో బొమ్మ' అనే పేరు ఒకటి సంపాదించుకున్నాను' అనుకున్నాడు లోలోపల.

3

గిరిజ పెళ్ళి వైభవంగానే జరిగిపోయింది. పెళ్ళికి ఆమె స్నేహితులు అంతా వచ్చారు. వచ్చినవాళ్ళంతా మొగుడి విషయంలో ఆమె సెలక్షను అభినందించలేక పోయారు.

'మరీ అంత బుద్ధావతారంగా వున్నాడేమిటి? ఇంతకు మించి ఆంధ్రదేశంలో మగాడే దొరకలేదా?' అను కున్నారు.

గిరిజకు కొంచెం క్లోజుగా వుండే అమ్మాయి వాళ్ళంతా ఇలా అనుకుంటున్నట్లుగా చెప్పింది.

గిరిజ నవ్వి "ఎవరో యేదో నా మొగుడి గురించి అను కున్నారని నేను బాధపడను. అందంగా, చురుగ్గా వున్న మొగుడు రేపు నన్ను తన గుప్పిట్లో వుంచుకుని నలిపే స్తుంటే వీళ్ళంతా జాలిపడతారు. నాకు ఆ స్థితి రాకూడ దనే నేను ఇలాంటి మొగుడ్ని ఎన్నుకున్నాను. ఎవరే మనుకుంటే నాకేమిటి? భవిష్యత్తులో నా మాటకు వుండే విలువ, నా సుఖం నాకు ముఖ్యం" అన్నది.

కొంతమంది గిరిజ వాదనతో ఏకీభవించారు.

పెళ్ళిలోనే గిరిజకు అత్తగారు నిజంగానే అసాధ్యు రాలు అనే అనుమానం బాగానే బలపడిపోయింది. ఈ విషయం గురించే తల్లీ కూతుళ్ళ మధ్య కొంత చర్చ జరి గింది. తల్లి కూతురుకు ధైర్యం చెప్పింది.

"నిజంగా ఇది నీలోవున్న నా లక్షణాలకు ఓ పరీక్ష. నేనుకూడా నీలాగా కాపురానికి వచ్చాను. వచ్చిన తర్వాత మీ నాన్నను నా దారికి తీసుకురావటానికి అత్త గారు ప్రతిబంధకమయ్యింది. ఐనా నేను నిరుత్సాహపడ లేదు. ఎన్నో శక్తియుక్తులను ప్రయోగించాను. చివరకు విజయం సాధించాను. ఇప్పుడు నువ్వు కూడా మీ అత్త గారిమీద విజయం సాధించి ఆమెనో చెప్పుకింద తేలుగా మారుస్తావనే నమ్మకం నాకు వుంది. ఈ విషయంలో నువ్వు విజయం సాధించాలని మనసారా కోరుకుంటు న్నాను" అని ఇంకొన్ని మంచిమాటలను కూతురుకు చెప్పి

కూతురును అత్తగారింటికి పంపించింది తల్లి.

తల్లి తనమీద వుంచిన కొండంత నమ్మకాన్ని నిజం చేసుకోవాలనే బాధ్యతతో అత్తగారింట అడుగుపెట్టింది గిరిజ. కోడల్ని అత్తగారు సాదరంగానే ఆహ్వానించింది. రెండురోజులు కూతురు దగ్గరే వుండి వియ్యపురాలు చూడకుండా మరోసారి హితబోధ చేసి తిరిగి వెళ్ళిపోయింది జానకమ్మ.

వారం రోజులపాటు ముందు ఆ యింటినీ ఆ యింటి ఆచారవ్యవహారాలనూ క్షుణ్ణంగా, మవునంగా పరిశీలించింది గిరిజ. ఒక అవగాహనకు వచ్చిన తర్వాతనే తను అవసరమనుకున్న కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని అనుకున్నది.

4

ఆ రోజునించీ తన కార్యక్రమాన్ని మొదలుపెట్టింది గిరిజ.

అందులో భాగంగా ఉదయమే పాలమనిషి దగ్గరే సంస్కరణ మొదలయింది. రోజూ అత్తగారు ఉదయమే పాలు పోయించుకునేది. కాని ఆరోజు పాలమనిషి వచ్చేసరికి గిరిజ సిద్ధంగా వుంది.

గిన్నె తీసుకొని పాలు పోయించుకోటానికి వచ్చిన గిరిజను చూసి పాలుపోసేది ఆశ్చర్యపోయి "అమ్మగారూ యివాళ మీరు వచ్చారేంటి?" అనడిగింది.

"ఇవాళే కాదు....ఇకనించీ పాలు నేనే పోయించుకుంటాను. కోడలు అంటే ఎవరనుకున్నావ్? ఇంటి బాధ్యతలు తీసుకోవలసిన మనిషి. ఇన్నాళ్ళూ ఈ ఇంటి బాధ్యతలతో మా అత్తగారు అలసిపోయింది. ఇహనుంచీ ఆమె హాయిగా విశ్రాంతి తీసుకుంటుంది...." అన్నది

గిరిజ నవ్వుతూనే

ఈ మాటలను అక్కడే గుమ్మం దగ్గర నిలబడిన ఆమె అత్త సుందరమ్మ వింటూనే వుంది. ఎంతో వినయంగా కనపడే కోడలు అలా మాట్లాడుతుందని ఆమె ఏమాత్రం వూహించలేకపోయింది.

ఆమెకు అంతా అర్థమైపోయింది.

పాలమనిషి అర శేరు పాలు పోసింది.

"ఇంకో పావు శేరు యెక్కువ పొయ్యి" అన్నది గిరిజ.

"ఎందుకమ్మా....పాయసం చేస్తున్నారా?"

"పాయసం కాదు. ఇకనించీ రోజూ ముప్పావు సేరు పాలుపొయ్యి. అర సేరు పాలు చాలడంలేదు. ఇంట్లో నేనో మనిషిని ఇప్పుడు పెరిగాను కదా!"

"అది కాదమ్మా, మీ అత్తగారు..." అంటూ పాల మనిషి ఏదో చెప్పపోయింది. కాని గిరిజ వినిపించుకోకుండా లోపలకు వెళ్ళిపోయింది.

పాలమనిషి సుందరమ్మను ఆశ్చర్యంగా చూసింది. దానికి ఆ యింట్లో సుందరమ్మ హోల్డు పోతోందని తెలిసి పోయింది.

సుందరమ్మకు కూడా ఆ ఇంటి పెత్తనాన్ని కోడలు తనంతట తానుగానే లాక్కుంటున్నదని అర్థమయ్యింది.

ఆ తర్వాత కూరలమ్మేవాడు బండీమీద కూరలు తీసుకు వచ్చి యింటి ముందు ఆగి, పెద్దగా కేకలు పెట్టాడు.

సుందరమ్మ బయటకు వెళ్ళబోయింది కాని ఈలోపలే గిరిజ సంచీ తీసుకుని బయటకు వెళ్ళింది. అలా వెళుతున్న కోడల్ని చూసి సుందరమ్మకు తీవ్రమైన కోపం వచ్చింది.

ఏనా ఏమీ మాట్లాడలేకపోయింది.

కోడలు ఖరీదయిన కూరలు బేరం చెయ్యకుండా నే తీసుకుంటుంటే కూరల బండీవాడు ఆశ్చర్యపోయాడు.

రోజూ సుందరమ్మ చౌకగా వున్న ఎండిపోయిన కూరలను గంటసేపు బేరంచేసి కొంటూవుంటుంది.కొంచెం ఖరీదుగా వున్న కూరలను అసలు తీసుకోదు.

కూరలు తీసుకుని బండీవాడి దగ్గర వున్న పద్దు పుస్తకంలో రాసి లోపలకు వచ్చింది.

లోపలకు రాగానే "అంత ఖరీదయిన కూరలు యిప్పుడెందుకు?" అన్నది సుందరమ్మ—గిరిజను.

"వారం రోజులనుంచీ మీరు చౌకగా వున్నాయని కొంటున్న ఒకే రకం కూరలు తిని విసుగు పుట్టింది..." అన్నది.

"అంత ఖరీదైన కూరయి మనలాంటి వాళ్ళు కొనేవి కాదు. ధనవంతులు కొనే కూరలు అవి. మన తాహతు యెంతో తెలుసుకుని మనం ప్రవర్తిస్తే బావుంటుంది" అన్నది సుందరమ్మ.

"మీరు చౌకరకం, నాసిరకం తిండి తింటానికి అలవాటుపడ్డారేమో. నేనలాకాదు. మా ఇంట్లో తాజా కూరలు, తాజా తిండి తినవచ్చును. మీరు పెడుతున్న తిండి తినలేకుండా వున్నాను. ఈ రోజునుంచీ వంట కూడా నేనే చేస్తాను. మీవంట నాకు నచ్చటంలేదు."

"అట్లాగా....ఇది నీ పుట్టిల్లు కాదు. మీ నాన్న నీకు ఖరీదైన తిండిపెడితే నువ్వు అక్కడకు వెళ్ళినప్పుడు అలాంటి తిండే తిను. కాని యిక్కడ నువ్వు అలాంటి తిండి గురించి ఆలోచించకు. నువ్వు ఈ ఇంటి అలవాట్లకు, ఆచారాలకు అలవాటుపడాలి. మీ అమ్మ నీకు ఈ విష

యాలన్నీ చెప్పే వుంటుంది" అన్నది సుందరమ్మ.

"మా అమ్మ నాకు ఒక్కటే చెప్పింది. మీ అత్తగారు ఇన్నాళ్ళూ యింటి బాధ్యతతో అలిసిపోయింది. ఆ బాధ్యతలన్నింటినీ నువ్వు తీసుకొని ఆమెకు విశ్రాంతిని కలగజెయ్యమని చెప్పింది. అందుకు మీరు ఇలాంటి చిన్న చిన్న విషయాలగురించి పట్టించుకోకండి."

కోడలు ఎంత తెలివైనదో సుందరమ్మకు ఆ క్షణంలో అర్థమయ్యింది.

ఎందుకంటే ఆమెకూడా ఇదే కోవకు చెందిన మనిషి. ఆమె కూడా ఆ యింటికి కోడలుగా వచ్చినప్పుడు ఇంటి పెత్తనాన్ని తన అత్తగారి దగ్గర్నించి తన చేతిలోకి తెచ్చుకోటానికి యెన్నో విధాల ప్రయత్నం చేసింది. చివరకు విజయం సాధించింది. ఆ రోజునించీ ఈ రోజు వరకు పెత్తనాన్ని అలా సాగిస్తూనే వుంది.

ఇప్పుడా పెత్తనాన్ని కోడలు తన్నుకుపోవాలని చూస్తుందని తెలియగానే ఆమె కలవరపడింది.

"నీ నాటకాలు నాకు తెలుసు. ఈ ఇంటి బాధ్యతలతో నేను అలసిపోలేదు. నాకు విశ్రాంతి అవసరం లేదు. యిక్కడి అధికారాన్ని నీ గుప్పిట్లోకి తీసుకొని మామీద సవారి చెయ్యాలని చూస్తున్నావు" అన్నది సుందరమ్మ.

"అధికారాన్ని గుప్పిట్లోకి తీసుకోటానికి ఇదేమైనా పెద్ద ఎస్టేటా? లేకపోతే ఓ రాష్ట్ర అధికారమా? ఈ యింట్లో వున్నది ముగ్గురు మనుషులం. అందులో నన్ను మినహాయిస్తే ఇక ఇద్దరి మనుషులమీద నేను అధికారం చెలాయించేది ఏముంది? మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు. దయచేసి అర్థంచేసుకోటానికి ప్రయత్నిం

చండి" అన్నది.

"నువ్వు బాగా నటిస్తున్నావు. నీ నాటకాలు నా దగ్గర పనిచెయ్యవు. నీకు నా గురించి పూర్తిగా తెలీదు. సుందరమ్మ మంచితనానికి ప్రాణం ఇస్తుంది. కోపం తెప్పిస్తే ప్రాణంతీస్తుంది. గుర్తుంచుకో" అని బెదిరించింది.

తేలిగ్గా నవ్వుకున్నది గిరిజ.

"అత్తా ...నువ్వు నిజంగా అసాధ్యురాలివే....నన్నే బెదిరిస్తున్నావా? ఈ గిరిజ—జానకమ్మ కూతురు.... జానకమ్మ హిస్టరీ నీకు తెలీదు. ఈ అధికార మర్దనంలో ఎవరు గెలుస్తారో" అనుకుంది.

5

గిరిజ రాత్రి వరకూ ఎల్లాగో ఆగిందికాని సుందరమ్మ ఆగలేకపోయింది. ఈ మధ్యలోనే కొడుకును పెరట్లో బావి దగ్గర నిలబెట్టి కోడలు ఆ ఇంటి అధికారాన్ని తన చేతుల్లోకి లాక్కోటానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నదో వివరించి చెప్పింది.

"అలాగా. నువ్వు కంగారుపడకు. దానికి నేను రాత్రికి చెబుతానులే. అది నా మాట వింటుంది" అన్నాడు ఈశ్వర్.

"అది నీ మాట వింటుందనే నమ్మకం నాకు లేదు. మనం తెలీక గోతిలో పడ్డాం. ఇది కాపురానికి వచ్చి నెల కూడా నిండకుండా ఇట్లాంటి పెత్తనం వ్యవహారాలను మొదలు పెట్టిందంటే ఇంకొన్ని రోజుల్లో నన్ను యింట్లో నించి వెళ్ళగొడుతుంది. అందువల్ల నువ్వు ఈ రాత్రికే దాన్ని బాగా భయపెట్టు" అన్నది కొడుకుతో.

సరేనన్నాడు ఈశ్వర్.

ఈశ్వర్‌కి ఇలాంటి అత్తా కోడళ్ళ వ్యవహారంలో తలదూర్చాలంటే తల నొప్పి అనిపించింది. ఇలాంటి గొడవలు అసలు అతనికి ఇష్టం వుండదు. అయినా తల్లి బాధపడుతుందని ఆ రాత్రి తలుపులు మూసి గిరిజ గదిలోకి వచ్చిన తర్వాత మెల్లగా నోరు తెరిచాడు.

"నీకో విషయం చెప్పాలి గిరిజా. నువ్వేమీ అనుకోవుకదా" అని అడిగాడు.

భర్త చెప్పబోయే విషయం ఏమిటో గిరిజకు తెలుసు. అయినా ఏమీ తెలీనట్లు "చెప్పండి" అన్నది.

"నువ్వు బాధపడకూడదు" అన్నాడు.

"బాధపడే విషయాన్ని మీరు నాకు చెబుతారని నేను అనుకోను. నామీద మీకు వుండే ప్రేమ నాకు తెలుసు" అన్నది ముందుగానే.

గిరిజ అలా అనేసరికి ఈశ్వర్ పొంగిపోయాడు. నిజంగా తను భార్యమీద అంత ప్రేమ చూపుతున్నట్టుగా అతనికి తెలీదు.

"ఏమీ లేదు. నువ్వు ఈ ఇంటి అధికారాన్ని తన చేతిలోనించే లాక్కోటానికి ప్రయత్నం చేస్తున్నావని అమ్మ బాధపడుతోంది. ఇది నిజమేనా?" అడిగాడు.

"ఓస్ .... ఇంతేనా? ఇంకేమిటో అనుకున్నాను. ఇందులో ఇంటి అధికారం లాక్కోవటం అంటూ ఏమీ లేదు. మీ అమ్మ పోయించుకునే పాలు సరిపోవటంలేదు. అంతేకాదు. ఆమె కొనే కూరలు రోజూ అవే తిని విసుగు పుడుతోంది. అందుకే ఇకనించీ ఎక్కువ పాలు పోయించుకోవాలనుకున్నాను. మంచి కూరలు కొన్నాను. ఇందులో తప్పేమిటి? ఇంటి అధికారమంటే పాలు పోయించుకోవటమేనా? కూరలు కొనటమేనా?" అడిగింది.

"అవును. ఇవేమంత పెద్ద విషయాలు కాదు. ఇంత చిన్న విషయాలకోసం నువ్వు కలిగించుకోవటం ఎందుకు? ఎన్ని పాలు పోయించుకోవాలో అమ్మకి చెప్పు. అలాగే ఏ కూరలు తీసుకోమంటావో ఆమెకు చెప్పు. తీసుకుంటుంది" అన్నాడు.

"అలాగే.... నాకేం అభ్యంతరం లేదు" అన్నది గిరిజ.

తెల్లారిన తర్వాత అన్ని పనులు తల్లినే చెయ్యమని చెప్పాడు ఈశ్వర్. కాని ఆ పనులు చెయ్యబోయే ముందు తన భార్యను అడిగి చెయ్యమన్నాడు.

అందుకు తల్లి ఒప్పుకోలేదు.

"దాన్ని అడగాల్సిన ఖర్మ నాకేం పట్టింది? ఇది నా యిల్లు. నా ఇంటికి కోడలిగా వచ్చి నన్నే ఈ ఇంట్లో బొమ్మను చేసి ఆడించాలని చూస్తోంది. నువ్వు దానికి గట్టిగా చెప్పు. అది చెప్పినట్లుగా ఈ ఇంట్లో యేదీ జరగదు" అన్నది కోపంగా.

ఈశ్వర్ ఇరుకున పడిపోయాడు. గట్టిగా తల్లితో ఏమీ చెప్పలేకపోయాడు. అలాగని భార్యతో కూడా చెప్పలేకపోయాడు.

అతను మొదటినించీ మెతక మనిషే. కాదు. సుందరమ్మ తనకు వున్న ఒకే ఒక్క కొడుకు తను చెప్పిన మాట వినకుండా పోతాడేమోనని అలా మెతకమనిషిగా తయారు చేసింది.

"పోనీ .... నువ్వే సర్దుకుపోరాదూ" అన్నాడు భార్యతో.

"ఇందులో సర్దుకుపోవటానికి యేముంది? ఇన్నేళ్లొచ్చాయి. ఇన్నేళ్ళనించి ఈ ఇంటి పెత్తనం అంతా తానే మోస్తూ వచ్చిందికదా. ఇప్పుడు దాన్ని నాకు వదిలి ఓ

పక్కన కూర్చుని చూడటానికి మీ అమ్మకు అంత పట్టుదల ఏమిటి? ఇంటి పెత్తనం ఆనేది యెప్పుడయినా కోడలుకే చెందుతుంది. కోడలు రావటంతోనే అత్తగారు ఆ పెత్తనాన్ని కోడలుకు ఇచ్చెయ్యాలి. కావాలంటే మీ అమ్మ కాపురానికి వచ్చిన తర్వాత అలా యింటి పెత్తనాన్ని తన అత్తగారి దగ్గర్నించి తీసుకున్నాదో లేదో కనుక్కోండి. మీకే తెలుస్తుంది."

గిరిజ ఇంత విపులంగా చెప్పిన తర్వాత ఈశ్వర్‌కు భార్య మాటల్లో నిజమున్నట్టే అనిపించింది.

ఆ సాయంత్రం మొదటి ఆట సినిమాకు వెళదామన్నది గిరిజ. తెలుగు సినిమాకు పోదామన్నాడు ఈశ్వర్.

"వద్దు. హిందీ సినిమాకు వెళదాం. తెలుగు సినిమాలు చూసి బోర్ కొట్టింది" అన్నది.

"హిందీ సినిమా నాకు అర్థం కాదు."

"నాలుగు సినిమాలు చూస్తే అదే అర్థమవుతుంది. పదండి" అన్నది.

ఈశ్వర్ హిందీ సినిమాకు బయల్దేరాడు.

అతను కుర్చీ టిక్కెట్లు తీసుకోబోతుంటే వద్దని తనే బాల్కనీ టిక్కెట్లు తీసుకున్నది.

"ఎందుకు డబ్బులు దండగ? ఎక్కడ కూర్చున్నా ఆ సినిమాయేగదా చూసేది" అన్నాడు ఈశ్వర్.

"నిజమే. అలాగని నేల క్లాసుకు వెళ్ళి యే చుట్ట కాల్చుకునే మనిషి పక్కనో కూర్చుని సినిమా చూడలేము కదా. ఇది కూడా అంతే. మీ స్నేహితులెవరైనా కనపడినా ఘనంగా వుంటుంది" అన్నది.

అతనేమీ మాట్లాడలేకపోయాడు.

ఇంటర్వెల్ లో కూల్ డ్రింక్స్ వచ్చాయి.

భర్త డ్రింక్ లు తీసుకుంటాడేమోనని ఒక్క నిమిషమే చూసింది. కాని ఈశ్వర్ వాటిని చూడనట్లు ఎటో చూస్తున్నాడు.

అప్పుడు గిరిజే కూల్ డ్రింక్స్ కుర్రాడిని పిల్చి రెండు గోల్డ్ స్పాట్ లను ఇవ్వమన్నది.

ఈశ్వర్ ఏదో అనబోయాడు. అప్పటికే ఆ కుర్రాడు 2. బాటిల్ మూత ఓపెన్ చేశాడు.

"తీస్కోండి" అన్నది గిరిజ బాటిల్ని అతనికిస్తూ....

డ్రింకులు తాగిన తర్వాత ఈశ్వర్ డబ్బులు ఇవ్వక తప్పలేదు.

సినిమా వదిలిన తర్వాత బయటికొచ్చారు.

ఆ థియేటర్ నించి వాళ్ళ యిల్లు అంత దూరంకాదు. అయినా గిరిజ "అబ్బా....ఈ జనం అందరినీ రాసుకుంటూ నడవాలంటే విసుగ్గా వుంది" అంటూ ఓ రిక్షాని పిలిచింది.

"ఇల్లు దగ్గరే కదా....రిక్షా యెందుకు?" అన్నాడు ఈశ్వర్.

"దగ్గరే అనుకోండి....అయినా ఈ జనంలో నడవటం కష్టం....అయినా మనం రోజూ రిక్షాలు ఎక్కంకదా" అన్నది తనే బేరమాడి ఎక్కికూర్చుని.

ఆ రాత్రి ఈశ్వర్ పొదుపు గురించి మితంగా ఖర్చు చెయ్యటం గురించీ భార్యతో ఏదో చెప్పబోయాడు. కాని గిరిజ ఆ విషయాన్ని తేలిగ్గా కొట్టిపారేస్తూ "ఆమాత్రం నాకు తెలీదా? రేపు మనకు డబ్బులేక ఇబ్బంది పడుతుంటే నేను చూడగలనా? ఉన్నంతలోనే దర్జాగా బతుకుదాం. ఏదయినా పెళ్ళయిన కొత్తల్లోనే

పిల్లలు పుట్టేంతవరకే మనం అనుభవించేది. పిల్లలు పుట్టాక మన ఖర్చు పెరుగుతుంది. యింత చిన్న విషయం మీకు తెలుసుకదా" అన్నాది చివరగా.

ఆ ఇంట్లో అత్తకీ—కోడలుకీ మధ్య ప్రతి చిన్న విషయానికీ యుద్ధం మొదలయ్యింది. యెవరికివారే ఆ యుద్ధంలో విజయం సాధించాలని తీవ్రమయిన ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆ ఇద్దరిమధ్య ఈశ్వర్ అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోవటం మొదలు పెట్టాడు.

"నువ్వేం మగాడివిరా....కొత్తగా యింటికి వచ్చిన పెళ్ళాన్ని వంచి దారిలోకి తీసుకురాలేకపోయావు" అన్నది తల్లి.

"నేనేం చేసేది? ఇదంతా నీ పెంపకమే. చిన్నతనం నుండి నువ్వు నన్ను ఇట్లాగే పెంచావు. యే విషయంలో నువ్వు నాకు స్వతంత్రం యిచ్చావు. స్వతంత్రంగా ఆలోచించే అవకాశం యిచ్చావు. దీనికంతటికీ అసలు కారణం నువ్వే. కోడలు కూడా నీ మనిషే అని నువ్వు యెందుకు అనుకోవు" అని అడిగాడు ఈశ్వర్.

"అత్తగారు బతికున్నంతవరకూ ఇంటి బాధ్యతలు, గొడవలు ఆమే చూసుకుంటుందని యెందుకు అనుకోదు? ఇంత చిన్న వయసులోనే అధికారం చెలాయించాలనే తాపత్రయం దానికి యెందుకు?" అనేది సుందరమ్మ వాదన.

"నా మొగుడు. నా యిల్లు. ఈ సంపాదన అంతా నా మొగుడిది. ఆ మొగుడికి పెళ్ళాంగా ఆ సంపాదనను ఖర్చుపెట్టే హక్కు నాకు వుంది. అందుకే ఈ యింటి పెత్తనం నాది. నా పెత్తనాన్ని మీరు సహించలేక

పోతే ఈ ఇంట్లోనించి వెళ్ళిపోవచ్చు" అనేసింది గిరిజ.

"ఏమిటీ....నువ్వు నా యింట్లో నుంచి నన్నే వెళ్ళమంటున్నావా? నీకెన్ని గుండెలు? నీ అంతు చూస్తాను. ఈ సుందరమ్మ గురించి నీకు యింకా తెలీదు.....నీ మొగుడా? నీ మొగుడు యెక్కడినించి వచ్చాడు? ఎన్ని రోజుల క్రితం నీకు మొగుడయ్యాడు? వాడు ముందు నాకు కొడుకు. ఆ తర్వాత నీకు మొగుడు. నేను బతికున్నంతవరకు ఈ యింటిమీద సర్వాధికారాలు నాకే ఉంటాయి. నేను చచ్చిపోయిన తర్వాతనే నీకు ఈ యింట్లో అధికారం సంక్రమించేది" అన్నది సుందరమ్మ గట్టిగా.

అప్పుడే మొదటిసారిగా గిరిజ మెదడులోకి ప్రవేశించింది ఆ ఆలోచన—అత్తగారు బ్రతికి ఉండకూడదు అని.

6

గిరిజ అత్తగారింటికి వచ్చి, నెలదాటి రెండురోజులు గడిచాయి.

"నాకు అమ్మ—నాన్నను చూడాలని వుంది. ఒకసారి మనిద్దరం వెళ్ళి వద్దాం...." అన్నది గిరిజ, భర్తతో.

"నేను రావటం కుదరదు. ఈమధ్య ఆఫీసులో పని ఎక్కువగా వుంటోంది. సెలవులు కూడా ఇవ్వటంలేదు. ఎలాగ?" అన్నాడు.

"మీకు వీలు అవకపోతే నేనొక్కదాన్నే వెళతాను."

"ఒక్కదానివే వెళతావా? యేం బావుంటుంది?"

"బావుండేదేమిటి? మావాళ్ళు అలా అనుకోరు.

నేను ఇష్టపడే ఒక్కదాన్నీ వచ్చానని చెబుతాను. ఒక్కదాన్నే వెళ్ళటానికి నాకు భయంలేదు."

"సరే....నీ యిష్టం....మళ్ళీ యేమయినా అనుకోంటుంది మా అమ్మతో కూడా ఒక మాట చెప్పు" అన్నాడు.

"ఆమె అనుకునే దేమిటి? అయినా ఆమెతో చెప్పాల్సిన అవసరం నాకు లేదు. నాకు మొగుడే ముఖ్యం. మీ మాటే నాకు కావలసింది. మీరు సరేనన్నారు. అంతే. కావాలంటే మీరు చెప్పుకోండి" అన్ని అప్పటికప్పుడే సూట్ కేసులో తన బట్టలు సర్దుకుని పుట్టింటికి బయల్దేరింది.

ఒంటిగా యింటికి వచ్చిన కూతుర్ని చూసి జానకమ్మ కొద్దిగా ఆశ్చర్యపడింది.

"ఏమిటి విశేషం?" అనడిగింది.

"విశేషం ఏదీలేదు. కొంచెం పని వుండి వచ్చాను. ఒక విషయంలో నీ సలహా తీసుకోవాలి" అన్నది గిరిజ.

అప్పుడు తండ్రి జనార్దనం యింట్లో లేదు.

"ఏమిటా సలహా? వివరంగా చెప్పు...." అన్నది తల్లి....

అప్పుడు గిరిజ తనకీ తన అత్తగారికీ మధ్య జరుగుతున్న యుద్ధం గురించి తల్లితో చెప్పింది.

అంతా విని "అయితే మనం వూహించిన దానికంటే మీ అత్తగారు మరీ అసాధ్యురాలు అయివుంటుంది. ఇప్పుడు ఆడదానికి మరో ఆడదే పోటీగా వుంది. నువ్వు చెప్పినదాన్నిబట్టి చూస్తుంటే ఆమె కూడా మనలాంటి మనిషే అయివుంటుంది. అందువల్ల మనం జాగ్రత్తగా కే వుండాలి" అన్నది.

"అవును. ఆమె బతికివుండగా నాకు ఆ ఇంట్లో పెత్తనం రాదని గట్టిగా చెప్పింది. నిజంకూడా అంతే.

నాకు ఆమె భయపడేటట్టుగా కనపడటంలేదు. అందుకల్ల యిక నాకు ఒక్కటే మార్గం కనపడుతోంది. అదేమి టంటే ఆ ఘటాన్ని అడ్డు తొలగించుకోవటమే....” అన్నది.

ఉలిక్కిపడింది తల్లి.

“ఏమిటే నువ్వనేది! ఆమెను పైకి పంపుతా నంటావా?”

“అవును. తప్పదమ్మా. ఆమె మనిద్దరికంటే ఎక్కువ మొంకిది. ఇంకో పదేళ్ళవరకూ ఆమె మంచాన పడ కుండా హాయిగా తిరుగుతుంది. ఆ తర్వాత కదా నాకు ఆ ఇంట్లో పెత్తనంవ స్తే....అప్పటివరకూ నేను ఎదురు చూడలేను. ఈ లోపలే నేను అనుకున్నది జరిగిపోవాలి. అందుకు ఆమెను పైకి పంపించటం ఒక్కటే దారి”

“సాధ్యమేనంటావా?” అని సందేహాన్ని వెలి బుచ్చింది తల్లి.

“తల్చుకుంటే ఏది సాధ్యంకాదు. అయితే కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాలి.”

“ఏం చేస్తావు? ఏదయినా మందు పెడతావా?” అడిగింది.

“మందు పెడితే లాభంలేదు. తొందరగా చావదు. పైగా కొద్దిరోజుల్లోనే ఆ విషయాన్ని తెలుసుకుంటుంది. దాన్నించి బయటపడుతుంది. ఆమెకు నా ప్రయత్నం తెలిసిపోతుంది. అందువల్ల నువ్వు ఏదయినా ప్లాను ఆలో చించు.” అన్నది గిరిజ తల్లితో.

ఇంతలోనే తండ్రి వచ్చాడు. కూతుర్ని పలకరించాడు. చూసిపోదామని వచ్చినట్టుగా చెప్పింది తండ్రితో.

అత్తగారి గురించి చెప్పింది కాని ఆమెను పైకి పంపించే ఆలోచన చేస్తున్నట్టుగా ఆయనతో చెప్పలేదు.

చెబితే ఆయన కంగారు పడతాడేమోనని చెప్పలేదు. అంతేకాదు. తన ప్రయత్నాలను భయంతో సాగనివ్వక పోవచ్చును.

అల్లుడి గురించి అడిగాడాయన.

"ఆయనదేమీ లేదు నాన్నా. నా మాట కాదనే శక్తి ఆయనకు లేదు. ఎటొచ్చీ ఆ ఇంట్లో మా అత్తగారిదే పెత్తనం. తన పెత్తనం కిందకి ఇంకో మనిషి వచ్చినందుకు సంతోషపడింది. కాని ఆమె పెత్తనాన్ని నేను అంగీకరించటంలేదు. ఆమె నన్ను ఇబ్బందులు పెట్టి చెప్పుకింది తేలులా అణుచుకు రావాలని చూస్తోంది. ఆయన తల్లికి నచ్చ చెబుతున్నాడు కాని ఆమె వినటం లేదు" అన్నది తండ్రితో.

"పెత్తనందేముందమ్మా.... అల్లుడు నిన్ను బాగా చూసుకుంటే చాలు. ఆమె పోయిన తర్వాత ఇక పెత్తనమంతా నీదేకదా." అన్నాడు తండ్రి.

"సర్లే.... మీరు ఆపండి. పెత్తనం ఏమున్నదంటూ గిరిజను నిజంగానే గాజులు తొడుక్కున్నదాన్ని చెయ్యకండి. ముసలిదై పోయి కూడా దానకు ఇంకా పెత్తనం మీద అంత వ్యామోహం ఎందుకు?" అని గర్జించింది జానకమ్మ.

ఆ గర్జనకు భయపడి అక్కడినించి వెళ్ళిపోయాడు తండ్రి.

"నీ అత్తగారు కూడ ఇలా భయపడి పారిపోవాలి. వీలున్నంతవరకు ప్రయత్నం చెయ్యి. ముందుగానే తొందర పడి పైకి పంపించే ప్రయత్నాలు వద్దులే. ఎందుకంటే

ఏ మాత్రం బెడిసికొట్టినా మనం జైల్లో కూర్చోవలసి వస్తుంది. అందుకు లొసుగులు లేని దారి ఏదయినా కనపడిన తర్వాత తప్పనిసరి అయినప్పుడు ఆ ప్రయత్నం చేద్దాం."

"సరే.... మా అత్తగార్ని ఇంకొంచెం టైము, ఇంకొంచెం అవకాశము ఇస్తాను. మర్యాదగా తను పెత్తనాన్ని నాకు ఇస్తుందేమో చూస్తాను. నాకు అడ్డు తగిలిందంటే ఇక చివరి ప్రయత్నం ఆమెకు చావుతప్పదు." గిరిజ దృఢమైన స్వరంతో అన్నది తల్లితో.

"నీ యిష్టం. అంతా నీ తెలివి తేటలు మీద ఆధార పడివుంది. జాగ్రత్త. ఎప్పుడయినా అంతే. మొగుడ్ని వంచటం సులభమే. కాని ఆ తలను వంచడమే కష్ట సాధ్యమైనది. ఆ ఇంట్లో నీదే పైచెయ్యి కావాలని ఇక్కడే నేను ఆ దేవుడ్ని ఎప్పుడూ ప్రార్థిస్తూవుంటాను" అన్నది తల్లి.

ఆ రోజు నే తిరిగి అత్తగారింటికి ప్రయాణమయ్యింది గిరిజ.

7

అత్తా కోడళ్ళిద్దరికీ ఆ రోజు సాయంత్రం మళ్ళీ ఓ పెద్ద యుద్ధం జరిగింది. ఆ మధ్యాహ్నం సుందరమ్మ ఎవరింటికో పాస్కు కొట్టటానికి వెళ్ళింది. ఆ టైములో గిరిజ రవ్వలడ్లు చేసుకుని తిన్నది. షికారుకు వెళ్ళివచ్చిన అత్తగారికి కనీసం తను లడ్లు చేసిన విషయం కూడా చెప్పలేదు. ఐనా ఆమె తెలుసుకున్నది.

దాంతో ఆమెకు కోపం వచ్చి రకరకాల పిండివంటలు చేసుకుని రహస్యంగా తింటూ ఇల్లును గుల్ల చేస్తుందంటూ గిరిజను రకరకాల తిట్లు తిట్టింది. గిరిజ కూడా తనకు వచ్చిన రకరకాల తెలుగు, ఇంగ్లీషు తిట్లను తిట్టేసింది.

గిరిజ ఆ రాత్రి భోజనం చెయ్యకుండా అలిగి పడుకుంది. ఈశ్వర్ ఆఫీసునించి వచ్చి తల్లి చెప్పిన రవ్వలడ్ల కధ విని అలిగిపడుకున్న భార్యను భోజనానికి రమ్మని బతిమాలాడు. అయినా గిరిజ వెళ్ళలేదు. చివరికి భర్త ఎంతగానో బతిమిలాడిన తర్వాత కొన్ని షరతులను విధించింది.

"ఈ ఇంట్లో నేను గానీ మీ అమ్మగానీ ఎవరో ఒకరు వుండాలి. ఇద్దరం వుండటానికి వీల్లేదు. ఆమెను వెళ్ళి పొమ్మని చెప్పండి. ఆమె వెళ్ళకపోతే మనమే వేరు కాపురం పెడదాము. మీ అమ్మ పెట్టే నరకం నేను భరించలేను" అంది.

"అట్లాగే. ముందు నువ్వు భోజనానికిరా. అమ్మతో నేను మాట్లాడతానులే" అన్నాడు ఈశ్వర్.

భోజనం చేసింది గిరిజ.

ఇంకొంచెం పొద్దుపోయిన తర్వాత ఈశ్వర్ తల్లితో మాట్లాడాడు.

"ఈ పెత్తనం గురించే కదా ఈ గొడవంతా. ఆ పెత్తనం ఏదో నా భార్యకే ఇవ్వరాదా? అలా కాని పక్షంలో అది నిన్ను ఇంట్లోనుంచి వెళ్ళిపోయి వేరుగా ఎక్కడయినా వుండమంటోంది. లేకపోతే మనమే వేరు కాపురం పెడదామంటోంది. అందువల్ల నువ్వు ఏదో ఒక దానికి ఒప్పుకోక తప్పదు. మధ్యలో నేను నలిగి పోతున్నాను" అన్నాడు ఈశ్వర్ తల్లితో.

కొడుకు మాటలు విని ఆమె గుండె బాదుకుని పెద్ద పెట్టున యేడ్చింది.

"ఒరేయ్ ఈశ్వర్ పెళ్ళయిన తర్వాత పెళ్ళాం మాటలు విని నన్నే ఇంట్లోనించి వెళ్ళిపొమ్మని అంటు

న్నావా? లేకపోతే మీరే వేరుగా వెళ్ళిపోతామని చెబుతున్నావా? ఒక్క విషయం గుర్తుపెట్టుకో, నేను ఈ ఇంట్లోనుంచి వెళ్ళను. మీరు ఈ ఇంట్లోనుంచి వెళ్ళిన మరుక్షణంలోనే నేను రైలు కిందపడి చస్తాను. చచ్చే ముందు నా చావుకు మీ ఇద్దరూ కారణం అని ఉత్తరం రాసిపెట్టి మరీ చస్తాను. ఇక ఈ ఇంటపెత్తనం దానికి ఇవ్వను. అది చెప్పినట్టు ఈ ఇంట్లో ఏదీ జరగదు. వెళ్లిపో." అంటూ ప్రళయనాదం చేసింది.

ఆ నాదానికి భయపడివచ్చి భార్య గదిలో పడిపోయాడు ఈశ్వర్.

భర్త చెప్పినదంతా విని మౌనంగా తల వూపింది గిరిజ.

తెల్లవారిన తర్వాత భర్త ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సుందరమ్మ ఎవరింటికో కబుర్లకోసం వెళ్ళింది. భోజనం చేసిన తర్వాత అలా తిరిగి రావటం ఆమెకు అలవాటు.

ఆ రాత్రి ఈశ్వర్ అపరాధపరిశోధన కథల పుస్తకం తీసుకువచ్చాడు. అతను ప్రతినెలా ఆ పుస్తకాన్ని తీసుకువచ్చి చదువుతూ వుంటాడు. ఆ ఇంటికి వచ్చిన దగ్గర్నించీ గిరిజ కూడా వాటిని చదువుతోంది.

ఆమె వరండాలో కూర్చుని అపరాధపరిశోధన చదువుతున్నప్పుడు పోస్టుమేన్ వచ్చి గిరిజ చేతికి ఓ ఇన్లాండు కవరు అందించాడు. అది గిరిజ తండ్రి రాసిన ఉత్తరం. ఆమె ఆ ఉత్తరాన్ని ఓపెన్ చేసి చదువుతుంటే పోస్టుమేన్ అక్కడే నిలబడి గిరిజ ఉత్తరం చదవటం పూర్తిచేసిన తర్వాత "అమ్మా, ఈ అపరాధపరిశోధన పుస్తకంలో 'హత్యకు వెయ్యి మార్గాలు' కథ చదివారా?" అని అడిగాడు.

"ఎందుకు?" అన్నది గిరిజ.

"ఆ కథ రాసిన రచయిత శంకర్ ఈ వూళ్ళోనే వుంటాడమ్మా"

"ఈ వూళ్ళోనా?!"

"అవును. అతను ఈ వీధిలోనే చివరవున్న డాబా ఇంట్లో ఓ గదిలో వుంటున్నాడు. అతని కథలు ప్రతి నెలా ఈ అపరాధపరిశోధనలో వుంటాయి. అతనికి పుస్తకాలు రాగానే నేను కూడా తీసుకుని ప్రతినెలా చదువుతూ వుంటాను."

"అలాగా. అతనేం చేస్తూ వుంటాడు?" కుతూహలంగా అడిగింది గిరిజ.

"ఏదో చిన్న వ్యాపారం చేస్తున్నట్టున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదనుకుంటాను. ఎక్కువగా కథలు రాస్తూ వుంటాడు. అంతకుమించి నాకు వివరాలు తెలియవు" అన్నాడు.

"సరే.... వెళ్ళు" అన్నది గిరిజ.

పోస్టుమేన్ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళగానే ఆ పుస్తకంలోవున్న శంకర్ రాసిన 'హత్యకు వెయ్యి మార్గాలు' కథను చదివింది గబగబా.

ఆ కథను చదివి ఆశ్చర్యపోయింది గిరిజ. అందులో ఓ మనిషిని హత్య చెయ్యటానికి ఎన్నో రకాల మార్గాలు వున్నట్టుగా శంకర్ రాశాడు. అంతవరకు బాగానేవుంది. కాని హంతకుడు చేసిన చిన్న పొరపాటువల్ల చట్టానికి దొరికిపోతాడు నేరస్థుడిగా.... అదే గిరిజకు నచ్చలేదు.

ఎలాగయినా ఆ రచయితను కలుసుకుని మాట్లాడితే బావుంటుందనిపించింది గిరిజకు. తన అత్తగారి పీడ వది

లించుకోటానికి ఏదయినా మార్గం చెప్పకపోడు. ఎలా గయినా తను అతనితో మాట్లాడి తీరాలి అనుకుంది.

అనుకున్నదికాని అతన్ని ఎక్కడ కలుసుకోవాలో ఆరంకాలేదు. అతని గదికి తను వెళ్ళటం బావుండదు. ఎవరైనా చూసినా తను నలుగుర్లో చులకనవుతుంది.

పోనీ అతన్నే తన ఇంటికి రమ్మని కబురు పెడితే?

ఈ ఆలోచన కూడా గిరిజకు అంతగా నచ్చలేదు. తను ఆ రచయితతో ఒంటరిగా మాట్లాడే సమయంలో అత్త గారు వచ్చిందంటే కొంప మునుగుతుంది. తనమీద రకరకాల నిందలు వేస్తుంది. అలాంటి అవకాశం ఆమెకు ఇవ్వకూడదనుకుంది.

ఆ రాత్రి చాలా సేపటివరకు ఈ విషయం గురించే ఆలోచించింది గిరిజ.

చివరికి ఆమె ఒక ఉపాయం ఆలోచించింది.

దాని ప్రకారం ఆ రాత్రి ఈశ్వర్ గాఢ నిద్రలో మునిగిపోయిన తర్వాత రచయిత శంకర్ కు ఓ ఉత్తరం రాసింది.

అందులో తను అతని అభిమాని అనీ పెళ్ళయిన కారణంగా అతన్ని గదిలో లేక తన ఇంట్లో కలుసుకోవటం బావుండదు కాబట్టి మర్నాడు సాయంత్రం ఆరున్నర గంటలకు రైలుస్టేషన్ దగ్గర పార్కులో కలుసుకోమని రాసింది.

తెల్లవారిన తర్వాత భర్త ఆఫీసుకు వెళ్ళగానే గిరిజ ఆ ఉత్తరాన్ని పోస్టుచేసింది.

ఎలాగైనా అత్తగారి పీడ వదిలించుకోవాలని గట్టిగా అనుకున్నది.

8

సాయంత్రం ఆరున్నరగంటలు—

ఆ సమయంలోనే పార్కులోకి వచ్చింది గిరిజ. అప్పటికే అక్కడకు శంకర్ వచ్చి ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆ క్రితం రోజు సాయంత్రం తన గదిలోనించి బయటకు వస్తున్న శంకర్‌ను చూసింది కాబట్టి పార్కులో అతన్ని పోల్చుకోవటానికి ఇబ్బంది పడవలసిన అగత్యం ఏర్పడలేదు.

అతను కూడా ఆమెను గుర్తించి చిరునవ్వు నవ్వాడు. అతను కొంచెం లావుగా - బొద్దుగా వున్నాడు. చామన చాయలో ఓ మాదిరి పొడుగ్గా వున్నాడు.

ఆ పార్కు పెద్దదే. కాని ఎక్కువమంది జనం లేరు.

వాళ్ళిద్దరూ గుబురుగా వున్న ఓ చెట్టుపక్కనే కూర్చున్నారు.

"మీ గురించి పోస్టుమేన్ చెప్పాడు. మీ కథలు అపరాధపరిశోధనలో చాలా చదివాను. అవన్నీ నాకు ఎంతగానో నచ్చాయి. మీరు నేను వుంటున్న రోడ్డులోనే వుంటున్నారని పోస్టుమేన్ చెప్పిన తర్వాత ఎలాగైనా మిమ్మల్ని కలుసుకుని మాట్లాడాలనుకున్నాను." అన్నది గిరిజ.

శంకర్ చిరునవ్వుతో "థాంక్స్...." అన్నాడు.

"ఈ నెల సంచికలోవున్న మీ కథ "హత్యకు వెయ్యి మార్గాలు" కథ మరీ నచ్చింది. ఆ కథలో మీరు రాసినట్టుగానే ఓ మనిషిని హత్య చెయ్యటానికి అన్ని మార్గాలు ఉన్నాయంటారా?" అని అడిగింది ఆమె.

అతను నవ్వి "క్రయిం కథలు రాసే రచయితలకు

ఆడవాళ్ళలో అభిమానాలు ఉండటమే తక్కువ. అలాంటిది మీరు యింత వివరంగా ఆ కథల గురించి కూడా అడుగుతున్నారంటే మీకు క్రయిం సాహిత్యం పట్ల బాగా అభిమానం వుండివుంటుంది" అన్నాడు శంకర్.

"క్రయిం సాహిత్యం పట్ల అభిమానం సంగతి ఎలా వున్నా ముందు హత్యకు ఉన్న మార్గాల గురించి తెలుసుకోవటం ప్రస్తుతం నాకు చాలా అవసరం."

అతను ఆశ్చర్యంగా గిరిజను చూసి—

"మీ మాటలు నాకు అర్థం కావటంలేదు. దయచేసి వివరంగా చెప్పండి" అన్నాడు.

"వివరంగా చెప్పాలంటే నామీద హత్యాప్రయత్నం జరగవచ్చునని పిస్తోంది. కాని అది ఏ రూపంలో ఉంటుందో నేను ఊహించలేకుండా ఉన్నాను" అన్నది.

"వాట్!" అంటూ అదిరిపడ్డాడు శంకర్.

నిమిషం తర్వాత "మీరు చెబుతున్నది నిజమేనా?!" అని అడిగాడు.

"నూటికి నూరుపాళ్ళు నిజం. యిందులో అబద్ధం లేనేలేదు."

"ఐతే మిమ్మల్ని హత్య చెయ్యటానికి ఎవరు ప్రయత్నంచేస్తున్నారు? ఎందుకు?"

"ఎవరో కాదు. మా అత్తగారే నన్ను హత్యచేసే లేక చేయించే ప్రయత్నాలు చేస్తుందేమోనని నాకు భయంగా వుంది. ఇక ఆమెకీ నాకూ బాతిగా పడటంలేదు. ఆమె యెన్నో రకాల ఇబ్బందులు పెడుతోంది. వాటిని భరించలేక నేను యెదురుతిరుగుతున్నాను. అందుకని ఎలాగైనా నా అంతు చూస్తానని చాలాసార్లు బెదిరించింది. అది

బెదిరింపు కాదని నిజంగానే ఆమె నా అంతు చూస్తుందని నాకు అనుమానంగా వుంది."

"ఆశ్చర్యంగా వుంది. అలాంటప్పుడు ఈ విషయాన్ని మీ భర్తతో చెప్పి మీరు వేరుగా వుండొచ్చుకదా" అన్నాడు శంకర్.

"ఉండొచ్చు. నిజమే. అందుకు ఆయనకూడా ఒప్పుకున్నాడు. కాని మా అత్తగారు ఒప్పుకోలేదు. మమ్మల్ని వదిలి తను వెళ్ళిపోదుట. మేము వేరుగా వెళ్ళిపోతే తను అప్పుడే తన చావుకి మేమే కారణం అని ఓ ఉత్తరం రాసిపెట్టి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకుంటుందట. ఈ బెదిరింపుతో ఆయన వేరు కాపురం పెట్టటానికి ఒప్పుకోవటం లేదు. ఇక నాకేమిటి దారి?" అని అడిగింది గిరిజ—శంకర్ ని.

అతను ఓ ఐదు నిమిషాలు మాట్లాడకుండా తీవ్రంగా ఆలోచించి "ఇంతకీ నన్నేం చెయ్యమంటారు?" అనడిగాడు,

"ఆమె నన్ను ఏ విధంగా చంపగలదో చెప్పండి. నా జాగ్రత్తలో నేను ఉంటాను" అన్నది.

గిరిజకు తెలివి బాగానే పనిచేస్తోంది. అందుకే ఆమె రివర్స్ గేర్ లో తను అత్తగార్ని చంపటానికి పద్ధతుల గురించి అడక్కుండా ఆమే తనని చంపే అవకాశం వున్నట్టూ, ఆమె తనని ఏ విధంగా చంపే అవకాశం వుందో ముందుగానే తెలుసుకోటానికి అడుగుతున్నట్టుగా అతనికి ఏలాంటి అనుమానం రాకుండా అడిగింది.

శంకర్ నవ్వి "అంత పెద్దామె మిమ్మల్ని హత్యచేసే లేక చేయించే ప్రయత్నాలు చెయ్యటం ఏమిటి? మీరు అనవసరంగా భయపడుతున్నారు. ఆమెను అనుమానిస్తు

న్నారు" అన్నాడు.

"కాదు శంకర్ గారూ. దయచేసి మీరలా తేలిగ్గా తీసి పారెయ్యకండి. ఆమె సంగతి మీకు తెలీదు. రెండు సార్లు గొడవ జరుగుతున్నప్పుడు నా గొంతు నొక్కటానికి వచ్చింది కోపంతో. ఆమెకు నామీద అంతులేని కసి, ద్వేషం వున్నాయి."

అతను మధ్యలో ఆపేగాడు.

"మీమీద ఆమెకు అంత కసి, ద్వేషం యెందువల్ల ఏర్పడ్డాయి?"

"నేను కాపురానికి వచ్చిన తర్వాత ఆమె చేతిలోంచి యింటి పెత్తనాన్ని నేను లాక్కోవాలని చూస్తున్నానట. అందుకే ఆమెకు నేనంటే అంత పగ"

"నిజంగా ఇదంతా ఆశ్చర్యంగా వుంది. యిలాంటి గొడవల గురించి కూడా హత్యలు జరుగుతాయంటే నేను నమ్మలేకుండా వున్నాను".

"మీరు నమ్మలేకపోవచ్చు. కాని ఇది నిజం. అంతా జరిగిపోయిన తర్వాత నా పోయిన ప్రాణం తిరిగిరాదు. అందువల్ల ముందుగానే నా జాగ్రత్తలో నేను వుండటం మంచిదికదా. ప్లీజ్ చెప్పండి. ఆమె నన్ను ఏ విధంగా హత్యచేసే అవకాశాలు వున్నాయి" మళ్ళీ అడిగింది గిరిజ.

ఒక్క నిమిషం శంకర్ ఆలోచించి "మీరు ఇంతగా భయపడుతున్నారంటే మీ ఇద్దరిమధ్య బాగానే అడ్డుగోడలు లేచి వుంటాయి. ఆమె మీరు తీసుకునే ఆహారంలో ఏదయినా కలిపి చంపవచ్చు. కత్తితో పొడిచి చంపవచ్చు. మీ దొడ్లో బావి వుండి మీరు నీళ్ళు తోడుతున్నప్పుడు వెనకనుంచి వచ్చి అందులోకి నెట్టి చంపవచ్చు. లేదా మీరు కృశించి, నీరసించిపోయి చనిపో

యేట్టుగా ఏదయినా మందు పెట్టి చంపవచ్చు.... ఇలాంటి మార్గాలు ఎన్నో వున్నాయి" అన్నాడు.

అతను చెప్పినవన్నీ విని "మీరు చెప్పిన పద్ధతుల్లో నన్ను చంపే ప్రయత్నాలు చేస్తే నేరం ఆమెమీదకు వస్తుందనుకునే అవకాశం వుండదా?" అని అడిగింది.

"ఉంటుంది. ఐతే ఆ ఉండటమనేది హత్య జరిగిన సమయం పరిసితులమీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఆమె మరో మనిషి ఇంట్లో వుండగా మిమ్మల్ని చంపే ప్రయత్నం చెయ్యదుకదా. ఇంట్లో మీరిద్దరూ ఉన్నప్పుడే ఆ పని చేస్తుంది. అలాంటప్పుడు పోలీసులు హత్య జరిగిన తర్వాత తప్పకుండా ఆమే ఆ పనిచేసిందని తెలుసుకుంటారు. అందువల్ల ఆమె పట్టుబడే అవకాశం వుంది."

"ఇది హత్య అని తెలియకుండా సహజమైన చావు లాగా కనిపించే మార్గాలేమైనా వున్నాయా? ఒకవేళ ఆమె నన్ను అలా హత్య చెయ్యవచ్చు కదా!" అనుమానంగా అడిగింది.

"అలాంటి మార్గంకూడా ఒకటి వుంది. మీరు నిద్రపోతున్నప్పుడు దిండుతో మీ మొహాన్ని నొక్కిపట్టి ఊపిరాడకుండా చేసి చంపవచ్చు. అలాంటప్పుడు అది హత్య అని తొందరగా యెవరికీ తెలీదు. మామూలువాళ్ళకు సహజమైన చావుగానే కనపడుతుంది."

"నిజమే.... ఒక సినిమాలో చూశాను. మీరు చెప్పినట్టుగానే దిండుతో మొహంమీద నొక్కి హత్య చెయ్యటం.... బహుశ ఆమె నన్ను అలాగే హత్యచేస్తుందేమో" అన్నది గిరిజ భయం నటిస్తూ.

శంకర్ నవ్వాడు.

"మీరు అనవసరంగా భయపడుతున్నారేమో! ఆమె మిమ్మల్ని హత్య చెయ్యగలదనుకుంటే నాకు నమ్మకం కలగటంలేదు" అన్నాడు.

గిరిజ కూడా అదోలా నవ్వి "ఏదో ఒకరోజు మీరు నా హత్య వార్త విన్నప్పుడు బాగా ఆశ్చర్యపోతారు" అన్నది.

"మళ్ళీ యెప్పుడు కలుస్తారు?" అడిగాడు శంకర్.

"ఎప్పుడు కలుసుకునేది నేను మీకు ఉత్తరం రాస్తాను. నాలో భయం పెరిగినప్పుడు మీ సలహా తీసుకోటానికి తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను" అన్నది ఆమె లేస్తూ.

శంకర్ కూడా నిలబడ్డాడు.

అప్పటికే బాగా చీకటి పడిపోయింది.

9

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆ యింట్లోకి రిక్షా దిగి ఓ మనిషి లోపలకు వచ్చాడు.

అతను—సన్నగా పొడుగ్గా ఉన్నాడు. లోతుకు పోయిన కళ్ళు. పొడుగాటి ముక్కుతో విచిత్రంగా ఉన్నాడు.

ఎదురుగా వచ్చిన సుందరమ్మను చూస్తూనే "పిన్నీ బావున్నావా?" అనడిగాడు.

"ఆ....ఏం బాగులేరా నాగరాజూ....యేదో యిట్లా ఉన్నాను. నువ్వు రెండు నెలలనించీ ఈ ఊరికే రావటం లేదేం? మమ్మల్ని మరచిపోయావా?" అని అడిగింది ఆమె.

"రెండు నెలలూ మరో ప్రాంతంలో బిజినెస్సు బాగా ఉండటంతో ఇటువైపు రాలేదు. చిన్న పనుండి

యిప్పుడే వచ్చాను. మళ్ళీ సాయంత్రమే వెళ్ళిపోవాలి. ఈశ్వర్ ఆఫీసుకు వెళ్ళాడా?" అని అడిగాడు.

తన గదిలో కిటికీ దగ్గర నిలబడి ఓరగా తెరచివున్న కిటికీ రెక్కల సందునించి అతడ్ని చూసి ఇతనెవరో తెలుగు సినిమాలో తన్నులుతినే ఎలకలా ఉన్నాడే అనుకుంది గిరిజ.

తర్వాత నాగరాజు—సుందరమ్మ యిచ్చిన నీళ్ళుతాగి "ఈశ్వర్ పెళ్ళికి రావాలని యెంతో ప్రయత్నించేశాను. కాని వదల్లేరు. ఇంతకీ వదిన ఏదీ? ఇంట్లో యెక్కడా కనపడదేమిటి?" అంటూ లేచి గిరిజ ఉన్న గదివైపు వచ్చాడు.

సుందరమ్మ ఏదో మాట్లాడబోయి వూరుకుంది.

లోపలకు వచ్చిన నాగరాజును చూసి లేచి నిల్చుంది గిరిజ.

"హల్లో వదినగారూ. నా పేరు నాగరాజు. మీ అత్తగారికి అక్కయ్య కొడుకుని. అనివార్య కారణాల వల్ల మీ పెళ్ళికి రాలేకపోయాను" అన్నాడు చిరునవ్వుతో.

అతను నవ్వుతున్నా భయంకరంగానే అనిపించింది గిరిజకు.

ఇతని గురించి ఈశ్వర్ ఎప్పుడూ చెప్పలేదని అనుకుంది. రెండు నిమిషాలు అక్కడే నిలబడి సుందరమ్మ పిలవగానే ఆ గదిలోనించి వెళ్ళిపోయాడు నాగరాజు.

ఆ తర్వాత కొంచెంసేపు నాగరాజుతో గిరిజ మొండితనం గురించి చెప్పటం ఆమె విన్నది. అప్పుడే వెళ్ళి సుందరమ్మతో గొడవ పెట్టుకోవాలని అనుకున్నది.

కాని—నాగరాజు ముందు అదంతా బావుండదని

వూరుకుంది.

కావి___ నాగరాజు కోర చూపులు, ఓర చూపులు చూస్తుంటే అతను తప్పకుండా రౌడీ వెధవే అయి వుంటాడని అనుకున్నది.

"ఈ నాగరాజు మనింట్లో యెన్ని రోజులుంటాడు?" అనడిగింది ఆ రాత్రి భర్తను.

"ఏమో .... ఒక్కోసారి ఇరవై రోజులు కూడా ఉంటాడు. అమ్మకు నాగరాజంటే యిష్టం. అతను చిన్నతనంలో కొన్నాళ్ళు మా యింట్లోనే పెరిగాడు. అమ్మే అతన్ని పెంచింది. అతనేదో వ్యాపారం చేస్తున్నాడు. ఏం వ్యాపరమో నాకింతవరకు సరిగ్గా తెలీదు" అన్నాడు ఈశ్వర్.

"అతను ఇన్ని రోజులు ఈ ఇంట్లో పడి తింటుంటే మీ అమ్మకు ఇష్టంగానే ఉంటుంది. మనమేదైనా చేసుకు తింటే ఏడుస్తుంది" అన్నది గిరిజ.

ఈశ్వర్ భార్యతో ఏమీ అనలేదు.

అదే రోజు రాత్రి గిరిజ పన్నెండు గంటలు దాటిన తర్వాత తలుపు తీసుకొని బయటకు వచ్చింది బాత్ రూమ్ కెళ్ళటానికి.

బయటంతా చీకటిగా వుంది.

ఐనా ఆమెకు భయమనిపించలేదు. గిరిజకు అలాంటి చీకటంటే భయంలేదు. రోజూ తనే ఒంటరిగా బయట కొచ్చి బాత్ రూంకు వెళుతుంది. భర్తను నిద్రలేపదు. అతను ఎంతసేపటికీ నిద్రలేవడు.

ఈశ్వర్‌ను నిద్రలేపటం అంత సులభంకాదు.

బాత్ రూంలోకి వెళ్ళి బయటకు వచ్చింది.

అంతే. ఎవరో ఆమెను విసురుగా ముందుకు నెట్టినట్టు

అనిపించింది. అలా అన్పిస్తున్నప్పుడే ముందుకు బోర్లా పడిపోయింది.

పడుతూనే పెద్దగా అరిచింది.

పడటంవల్ల నుదుటిమీద చిన్న దెబ్బ తగిలింది.

గిరిజ అరుపు వినిపించి ఈశ్వర్ బయటకు వచ్చాడు. అప్పుడే ఆమె పైకి లేస్తోంది.

"ఏమయ్యింది?" అడిగాడు.

"ఎవరో నన్ను ముందుకు నెట్టారు?"

అప్పుడు అతను ఆ బాత్ రూం పక్కన అంతా వెతికాడు. ఎవ్వరూ కనిపించలేదు.

"ఎవరూ లేరు గిరిజా....నువ్వు అలాగని భ్రమపడి ఉంటావు" అన్నాడు.

"కాదు. ఎవరో నన్ను చెయ్యిపెట్టి ముందుకు నెట్టినట్టు అనిపించింది" అన్నది.

"అలాగే అనుకుంటే ఆ మనిషి ఎవరో యింతలోనే యెక్కడికి పారిపోతాడు. నీ చీరే పాదాలకు అడ్డుపడి ఉంటుంది. ముందుకి పడ్డావు."

"కాదు....కాదు ఈ యింట్లో మనుషులే యెవరో నన్ను నెట్టారు. నన్ను హత్యచెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నారు."

అలాంటి టైములో భార్యకు ఏం చెప్పాలో ఈశ్వర్ కు అర్థంకాలేదు.

వాళ్ళిద్దరూ యింట్లోకి వచ్చేసరికి నాగరాజు వచ్చి "ఏం జరిగింది? ఏమిటీ హత్య అంటున్నారు" అన్నాడు.

"ఏమీ లేదు. నువ్వెళ్ళి పడుకో" అన్నాడు ఈశ్వర్.

వెళ్ళిపోతున్న నాగరాజును అనుమానంగా చూసింది గిరిజ.

10

"ఇది హత్య. అందువల్ల నే నడిగే ప్రశ్నలకు సరయిన జవాబులు ఇవ్వండి" అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టర్ చంద్ర గిరిజతో.

"అడగండి" అన్నది ఆమె నీరసంగా.

అక్కడే సుందరమ్మ శవం మంచంమీద వెల్లకింతలా పడివుంది. ఆమె కనుగుడ్లు బయటకు పొడుచుకువచ్చాయి. గొంతు నొక్కటంవల్ల ఆమె మరణం సంభవించిందని పోలీసు డాక్టరు చెప్పాడు.

గొంతుమీద వేలిముద్రలులేవని వేలిముద్రల నిపుణుడు అన్నాడు.

"ఈ సాయంత్రం ఎన్ని గంటలకు మీరు బయటకు వెళ్లారు?"

"ఆరు గంటలకు" చెప్పింది.

"ఇప్పుడు సమయం తొమ్మిది గంటలు కావస్తోంది. ఇప్పటివరకూ మీరు యెక్కడ వున్నారు?"

"ఆయన ఆలస్యంగా యింటికి వస్తారని ఉదయమే చెప్పి వెళ్ళారు. అందుకని బోరుకొడుతుంటే సినిమాకు వెళ్ళాను."

"సినిమా అప్పుడే వదిలారా?"

"వదల్లేదు. కాని నాకు తల నొప్పిగా వుందని వచ్చేశాను."

"ఎన్ని గంటలకు బయటకు వచ్చారు?"

"ఒక పావు గంట క్రితం."

"ఏ థియేటర్‌కు వెళ్ళారు? మీ దగ్గర కట్ చేసిన టిక్కెట్ వున్నాదా?"

"ఉంది....సంధ్యా డీలక్స్ థియేటర్‌కు వెళ్ళాను" అంటూ చేతిలో వున్న హాండ్ పర్సులోనించి టిక్కెట్ పిస్ తీసి ఇన్‌స్పెక్టర్‌కు ఇచ్చింది.

చంద్ర దాన్ని చూసి జేబులో పెట్టుకున్నాడు.

"మీ ఫోటో వుంటే ఒకటి ఇస్తారా?"

గిరిజ బీరువాలో ఉన్న ఫోటో ఆల్బమ్‌తీసి అందులో నించి తను ఒక్కతే వున్న ఓ ఫోటోను చంద్రకు యిచ్చింది.

ఈశ్వర్ యేడుస్తున్నాడు తల్లి హత్య చెయ్యబడినందుకు.

ఇన్‌స్పెక్టర్ అతన్ని ఓదార్చి "మీరు కాకుండా ఈ యింట్లో యింకెవరు ఉంటున్నారు?" అడిగాడు.

ఈశ్వర్ యేడుస్తూనే నాగరాజు గురించి చెప్పాడు.

"నాగరాజా?! అతనెవరు? యిప్పుడెక్కడ ఉన్నాడు?"

ఇన్‌స్పెక్టర్ అలా అడుగుతున్నప్పుడే నాగరాజు లోపలకు వచ్చి అక్కడి దృశ్యాన్ని చూసి "పిన్నీ" అంటూ పెద్దగా అరిచి ఆమెమీద పడబోయాడు.

చంద్ర అతడ్ని పట్టుకుని "ముందు నేను అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి. ఆమె మామూలుగా మరణించలేదు. హత్య చెయ్యబడింది" అన్నాడు.

హత్య మాట వినగానే నాగరాజు అదిరిపడ్డాడు.

తర్వాత ఇన్‌స్పెక్టర్ అతన్ని కొన్ని ప్రశ్నలడిగాడు.

"సాయంత్రం ఏడున్నర కావస్తున్నప్పుడు నేను యీ యింటినించి బయటకు వెళ్ళాను. వెళ్ళి యిప్పటివరకూ 'హామ్‌సీడ్స్ సప్లయింగ్ షాపు' దగ్గర కూర్చుని పది నిమిషాలక్రితమే రిక్షాలో ఎక్కి యిక్కడికి వచ్చాను"

అన్నాడు నాగరాజు.

ఇంకో గంట గడిచిన తర్వాత సుందరమ్మ శవంతో యిన్‌స్పెక్టర్ తన పరివారంతో అక్కడినించి వెళ్ళి పోయాడు యెవర్నీ ఆ యింటినించి కదలవద్దనే ఆంక్ష విధించి.

అలా స్టేషన్‌కు వెళ్ళిన ఇన్‌స్పెక్టర్ చంద్రను అపరాధ పరిశోధనకు రచనలు చేసే శంకర్ కలుసుకున్నాడు.

కలుసుకుని గిరిజ తనని కలుసుకోవటం—మాట్లాడటం అంతా చెప్పేశాడు.

ఇన్‌స్పెక్టర్ అంతా విని "మైగాడ్" ఈ హత్య ఎంతో క్లియర్‌గా వుంది. హత్యకు మోటివ్ కూడా తెలిసిపోయింది. కోడలును హత్య చెయ్యాలనుకున్నా అత్తగారే హత్య చెయ్యబడిందంటే ఈ హత్య ఎవరు చేసి వుంటారు? అన్నాడు.

"ఎవరో కాదు సర్. నా అనుమానం ప్రకారం ఈ హత్యను గిరిజే చేసివుంటుంది. అత్తగారు తనని చంపుతుందేమోననే భయంతో ఆమె అత్తగార్ని హత్యచేసి వుండొచ్చు" అన్నాడు శంకర్.

"నిజమే. కాని ఆమె ఆ టైములో సంధ్య డీలక్స్ థియేటర్లో వున్నట్టుగా చెప్పింది. ఎంక్వయిరీ చేస్తేగానీ ఏదీ తెలీదు" అన్నాడు.

మరో పదినిముషాలకే ఇన్‌స్పెక్టర్ సంధ్య డీలక్స్ థియేటర్‌కు వెళ్ళి అక్కడి గేటుదగ్గర వుండేమనిషికి గిరిజ ఫోటో చూపించి మాట్లాడాడు.

అతను చెప్పిన మాట వినగానే అతనికి ఆశ్చర్యం కలిగింది.

ఎనిమిది గంటలు కావస్తున్నప్పుడే ఆమె థియేటర్లో

నించి బయటకు వెళ్ళిపోయిందిట. మళ్ళీ తిరిగి రాలేదని గట్టిగా చెప్పాడు అతను.

ఇమ్మీడియట్ గా వచ్చి ఇన్ స్పెక్టర్ గిరిజను కలుసుకున్నాడు.

"నిజం చెప్పండి. మీరు ఎనిమిది గంటలు కావస్తున్నప్పుడే థియేటర్లోనించి బయటకు వచ్చారుకదూ!"

తలవంచుకుంది గిరిజ.

"నిజమే....ఎనిమిదిగంటలు కావస్తున్నప్పుడే సినిమా విసుగుపుట్టి బయటకొచ్చాను. మనసు బావుండక అలా పార్కులోకి వెళ్ళి చాలా సేపు కూర్చొని తిరిగివచ్చాను. ఎనిమిదిగంటలకే బయటకు వచ్చానని చెబితే మీరు నన్ను అనుమానిస్తారని అలా చెప్పాను" అన్నది.

ఇన్ స్పెక్టర్ నవ్వాడు.

"ఇప్పుడు కూడా నేను మిమ్మల్నే అనుమానిస్తున్నాను. క్రయిం కథా రచయిత శంకర్ నన్ను కలుసుకుని అంతా చెప్పాడు. మీకు మీ అత్తగారికి మధ్య రగులుతున్న పగ గురించి జరుగుతున్న యుద్ధం గురించి అతను అంతా చెప్పేశాడు. ఇప్పుడు అంతా క్లియర్ అయ్యింది. ఎనిమిదిగంటలకే బయటకువచ్చిన మీరు ఇంటికి వచ్చి ఒంటిగావున్న మీ అత్తగార్ని హత్యచేసి మళ్ళీ బయటకు వెళ్ళిపోయారు. హత్య ఎనిమిది గంటలు దాటిన తర్వాత జరిగివుంటుందని డాక్టర్ అన్నాడు. ఏమీ తెలియనట్లు తొమ్మిదిగంటలు కావస్తున్నప్పుడు ఇంటికి తిరిగి వచ్చారు. ఎనిమిదిగంటలు దాటిన తర్వాత నించీ తిరిగి ఇంటికి వచ్చేవరకూ మీకు ఎలిబీ లేదు. వుండదు కూడా. ఇందులో ఎలాంటి సందేహంలేదు. ఈ హత్యను మీరే చేశారు."

"కాదు.... కాదు...." అంటూ అరిచింది గిరిజ పిచ్చి పట్టినదానిలా.

ఐనా ఇన్‌స్పెక్టర్ నమ్మలేదు. వినలేదు. ఆమెను కస్టడీలోకి తీసుకున్నాడు.

ఆ రాత్రే గిరిజ తల్లిదండ్రులకు కబురుచేశాడు ఈశ్వర్. అతనికి అంతా అయోమయంగా అనిపించింది. తను గిరిజ అందం చూసి మోసపోయానేమో అనే ఆలోచన వచ్చింది.

11

తెల్లవారుతూనే పరిగెత్తుకుంటూ వచ్చారు గిరిజ అమ్మా-నాన్న.

జనార్దనం - జానకమ్మ.

పోలీసు స్టేషన్లో వున్న కూతుర్ని కలుసుకున్నారు.

"నాన్నా" అంటూ భోరుమన్నది గిరిజ—ఏడుస్తూ.

ఆమెలో వున్న ధైర్యమంతా ఆ రాత్రి పోలీసు స్టేషన్లో గడిపేసరికి జారిపోయింది. ఇక తను ఆ నేరం నించి తప్పించుకోగలననే నమ్మకం కూడా పోయింది.

తనే ఈ నేరం చేసిందనటానికి బలమైన సాక్ష్యంగా తను నమ్ముకున్న కథారచయిత శంకర్ నిలిచాడు.

అతడిని కలుసుకుని తనగొయ్యిని తానే తవ్వుకున్నది-అనుకుంది.

"ఇక ఈ ఉచ్చునుంచి తప్పించుకోలేను నాన్నా.... అన్ని సాక్ష్యాలూ నేనే ఈ హత్య చేసినట్టుగా నిరూపిస్తున్నాయి. మరో మనిషి ఆమెను హత్య చేసే అవకాశం లేదుట. అందువల్ల ఈ హత్యను నేనే చేశానని ఇన్‌స్పెక్టర్ అంటున్నాడు. బహుశ నాకు ఉరిశిక్ష పడొచ్చునని కూడా అంటున్నారు. తప్పితే జీవిత ఖైదు

తప్పదుట....అత్తలు నశించాలని నినాదాలు ఇచ్చాం. కాని ఈ రోజు అత్తలతో పాటు కోడళ్ళం కూడా నశించి పోతున్నాం" అన్నది పెద్దగా యేడుస్తూ....

కూతురి యేడుపు చూసేసరికి వాళ్ళిద్దరికీ దుఃఖం ఆగ లేదు.

"భయపడకు తల్లీ....నువ్వు నిర్దోషివే....తప్పకుండా విడుదల అవుతావు" అన్నాడు జనార్దనం కూతురుకన్నీళ్లు తుడుస్తూ....

12

"ఏమిటీ! సుందరమ్మగార్ని మీరు హత్య చేశారా?!" ఆశ్చర్యంగా అడిగాడు ఇన్ స్పెక్టర్ చంద్ర.

"అవును ఇన్ స్పెక్టర్ గారూ.... నేరం కూతురుమీద పడిందని దాన్ని నా తలమీద వేసుకోవటంలేదు. నిజంగా నేనే ఆమెను నేను గొంతునొక్కి చంపాను. ఐతే ఈ నేరం ఆ సమయంలో ఇంట్లోలేని నా కూతురుమీద పడుతుందని నేను అనుకోలేదు" అన్నాడు జనార్దనం.

"వివరంగా చెప్పండి....ఎందుకు చేశారీ హత్య?" అన్నాడు ఇన్ స్పెక్టర్.

అంతా జనార్దనాన్ని ఆశ్చర్యంగా చూశారు.

"నా కూతుర్ని చూసిపోదామని పావు తక్కువ ఎనిమిదిగంటలు కావస్తున్నప్పుడు వచ్చాను. తలుపులు దగ్గరకు నూసివున్నాయి. తలుపులను నెట్టాలనుకుని లోపల్నించి గిరిజ గురించిన మాటలు వినపడేసరికి ఆగి పోయి ఆ మాటలు విన్నాను.

నా కూతురు అత్తగారు సుందరమ్మ అంటున్నది. 'ఈ కోడలు గిరిజ పీడ ఎలాగైనా వదిలించుకోవాలిరా నాగరాజా. ఇది నా కొడుకును గుప్పిట్లో ఇరికించుకుని

వాళ్ళని కీలుబొమ్మను చేసి ఆడిస్తోంది. అట్లాగే నన్ను కూడా ఆడించాలని ఈ ఇంటి పెత్తనాన్ని తనే చెలాయించాలని చూస్తోంది. ఇది బతికివుంటే ప్రమాదం.... ఏ మందో పెట్టి నన్ను పైకి పంపించి ఆ తర్వాత నా కొడుకును దిక్కులేని వెధవను చేస్తుంది. అందుకే దీన్ని పైకి పంపించే ఏర్పాటు ఏదైనా వుంటే చూడరాదూ' అన్నది.

అందుకు ఆ నాగరాజు 'నువ్వు ఈ విషయం గురించి నిశ్చింతగా వుండవే పిన్నీ.... నా చేతిలో ఇద్దరు మనుషులు వున్నారు. నాలుగువేలు మనవి కాదనుకుంటే ఆ గిరిజ బజారుకు వెళ్ళినప్పుడు వెనకనించి వచ్చి పొడిచిపోతారు. ఆ హత్యను మనం చేయించామని ఎవ్వరూ అనుకోరు. ఏ నగలకోసమో ఇంకేదో కారణంగానో హత్య జరిగిందనుకుంటారు. రేపే ఆ మనుషులతో మాట్లాడతాను. నువ్వు డబ్బు సిద్ధంచేసి వుంచు' అని బయటకు వెళ్ళిపోయాడు. నేను చీకట్లోకి క్రోటన్ మొక్కల చాటుకు తప్పుకున్నాను.

వాళ్ళిద్దరి మాటలూ నాలో ఆవేశాన్ని కలిగించాయి. ఆ సుందరమ్మ నేను ఎంతో అపురూపంగా పెంచుకున్న నా కన్న కూతుర్ని కిరాయి రౌడీలతో చంపించాలనుకుంటున్నదని వినగానే ఆమెవల్ల నా కూతురుకు ప్రమాదం వుందని తెలియగానే ముందుగా ఆమెనే చంపాలనుకున్నాను.

వెంటనే ఇంట్లోకి వెళ్ళాను. ఆమె మంచంపైన అటు తిరిగి పడుకున్నది. వెనుకనుంచి వెళ్ళి గొంతు పట్టుకొని నొక్కి చంపేసి వేలి ముద్రలు తుడిచి అక్కడినించి తిరిగి మా వూరు వెళ్ళిపోయాను. నన్నెవరూ చూడలేదు

కాబట్టి. అనుమానం నా మీదకి రాదనుకున్నాను. కానీ ఇప్పుడు అనుమానం నా మీదికి రాకపోయినా నిర్దోషి అయిన నా కూతురు దోషిగా నిలబడేసరికి నా అంతట నేనే బయటపడక తప్పలేదు" చెప్పాడు జనార్దనం.

"ఏమండీ. ఇప్పటి ఈ స్థితికి నేనే కారణం" అన్నది ఆయన భార్య జానకమ్మ యేడుస్తూ—

"కాదు. నేనే కారణం" అన్నది గిరిజ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"అవును. నూటికి నూరుపాళ్ళు మీరే కారణం. చిన్నతనం నించే కుటుంబపెత్తనమంతా ఆడదే చెలాయించాలనే సిద్ధాంతంతో నువ్వు దాన్ని పెంచావు. అదే సిద్ధాంతం కోసం గిరిజ అత్తగారితో యుద్ధానికి తలపడింది. దాని ఫలితం ఇది. నిన్ను, కూతుర్ని అదుపులో వుంచలేని నా అసమర్థతవల్ల పిల్లిలాంటి నేను ఈ రోజు హంతకుడినయ్యాను. గిరిజా అత్తా ఒకప్పటి కోడలు... ఇవాల్టి కోడలే రేపటి అత్త... అలాంటప్పుడు రేపు నువ్వు కూడా అత్తవే అవుతావు. తప్పుడు స్లోగన్లు, తప్పుడు సిద్ధాంతాల ఫలితం ఎప్పుడూ తప్పుడుగానే వుంటుంది" అన్నాడు జనార్దనం చివరగా—

—: అయిపోయింది :—